



ఇది సమీకృత, సృజనాత్మక బడ్జెట్. వికసిత్ భారత్‌కు నాలుగు స్తంభాలైన యువత, పేదలు, మహిళలు, రైతుల సాధికారతను ఈ బడ్జెట్ పెంచుతుంది. 2047 నాటికి దేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా మార్చేందుకు ఈ బడ్జెట్ గ్యారెంటీ ఇస్తుంది.

- నరేంద్ర మోదీ, ప్రధాని

47,65,768 కోట్లు

ఇది కేంద్ర బడ్జెట్

నమస్తే తెలంగాణ

హైదరాబాద్

శుక్రవారం 2 ఫిబ్రవరి 2024

www.ntnews.com

ఆశ, అంగన్వాడీ కార్యకర్తలకు

ఆయుష్మాన్

- గర్భాశయ క్యాన్సర్ నిర్మూలన కోసం బాలికలకు టీకా
- వ్యాక్సిన్ల సమాచారం కోసం యూ-విన్ ప్లాట్‌ఫామ్
- గర్భిణుల్లో పోషకాహారం కోసం 'పోషణ్ 2.0'
- ఆరోగ్య రంగానికి బడ్జెట్‌లో రూ.90 వేల కోట్లు

న్యూఢిల్లీ: ఆశావర్కర్లు, అంగన్వాడీ కార్యకర్తలకు రూ.5 లక్షల కవరేజీతో ఆయుష్మాన్ భారత్‌ను వర్తింపజేస్తామని ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో ప్రకటించారు. 'సాక్షమ్ అంగన్వాడీ' పథకం కింద ఆంగన్వాడీ కేంద్రాలను ఆధునీకరిస్తామని..గర్భిణులు, పిల్లల్లో పోషకాహార లోపాన్ని తగ్గించేందుకు 'పోషణ్ 2.0' కార్యక్రమాన్ని అప్‌గ్రేడ్ చేస్తామని పేర్కొన్నారు. గర్భాశయ క్యాన్సర్ బారిన పడకుండా 9-14 ఏండ్ల బాలికలకు క్యాన్సర్ నిరోధక టీకాపై దృష్టి సారిస్తామన్నారు. మరోవైపు పిల్లల్లో రోగ నిరోధకత పెంచటానికి 'మిషన్ ఇంద్రధనస్సు'ను నిర్వహించేందుకు 'యు-విన్' ప్లాట్‌ఫామ్‌ను దేశవ్యాప్తంగా విస్తరిస్తామని ఆర్థిక మంత్రి తెలిపారు.



మరిన్ని మెడికల్ కాలేజీలు

'ప్రజలకు సేవ చేయాలని ఎంతో మంది యువత వైద్య వృత్తి వైపు మొగ్గు చూపుతున్నారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతం ఉన్న మౌలిక సదుపాయాలను వినియోగించుకొని మరిన్ని మెడికల్ కాలేజీలను ఏర్పాటు చేస్తాం' అని నిర్మల తెలిపారు. ఇందుకోసం ఓ కమిటీని నియమిస్తామని వెల్లడించారు.

ఆరోగ్య రంగానికి ఈ సారి బడ్జెట్‌లో రూ.90,658.63 కోట్లు కేటాయించారు. గతేడాదితో పోల్చితే ఇవి 12.59 శాతం ఎక్కువ. ఇందులో రూ.87,656.90 కోట్లు ఆరోగ్యం-కుటుంబ సంక్షేమానికి కేటాయించారు.

వందేభారత్ స్థాయికి 40 వేల బోగీలు

మూడు రైల్వే కారిడార్‌లు అభివృద్ధి

న్యూఢిల్లీ: రైల్వేల ఆధునీకరణపై కేంద్రం కీలక నిర్ణయాలు తీసుకుంది. నగరాలు, పట్టణాలకు మెట్రో, నమో రైళ్లను విస్తరించాలని నిర్ణయించింది. 40 వేల సాధారణ బోగీలను వందే భారత్ బోగీ ప్రమాణాల స్థాయికి మార్చనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ మధ్యంతర బడ్జెట్‌లో వెల్లడించారు. అంతేకాకుండా ఈ శాఖను మూడు ప్రధాన ఆర్థిక కారిడార్‌లుగా ఏర్పాటు చేయనున్నారు. వీటిని ప్రధాని గతి శక్తి కింద గుర్తించి వివిధ మార్గాల ద్వారా అనుసంధానిస్తారు. ఈ నడవాల ఏర్పాటుతో అత్యధిక ట్రాఫిక్ కారిడార్లపై ఒత్తిడి తగ్గడమే కాక, సరుకు రవాణా మరింత మెరుగవుతుందని, ఖర్చు కూడా బాగా



తగ్గుతుందని చెప్పారు. ప్రస్తుత కోచ్‌లను వందే భారత్ స్థాయి ప్రమాణాలతో మార్పు చేయడం వల్ల భద్రతా ప్రమాణాలు పెరిగి ప్రయాణికులకు సుఖవంతమైన ప్రయాణ సౌకర్యం కలుగుతుందన్నారు. ప్రభుత్వం ఏర్పాటు చేయనున్న మూడు రైల్వే కారిడార్లలో మొదటిది 'విద్యుత్, ఖనిజ, సిమెంట్' కారిడార్ కాగా, రెండోది పోర్టులను అనుసంధానించే కారిడార్. మూడోది ట్రాఫిక్ డెన్సిటీ కారిడార్.

మొక్కుబడి బడ్జెట్

యథాతథంగా పన్నుల విధానం

వేతన జీవులకు దక్కని ఊరట

ఆహారం, ఎరువులపై సబ్సిడీ కోత

రూ.47.66 లక్షల కోట్లతో కేంద్ర బడ్జెట్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ప్రజాకర్షక పథకాలు లేవు.. పన్ను విధానంలో మార్పు లేదు. అలాగని.. సామాన్యులకు ఎటువంటి రాయితీలూ లేవు. త్వరలో లోక్‌సభ ఎన్నికలను ఎదుర్కోబోతున్న కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం గురువారం లోక్‌సభలో సాదాసీదా బడ్జెట్‌ను ప్రవేశపెట్టింది. కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్.. 2024-25 ఆర్థిక సంవత్సరానికిగాను మధ్యంతర బడ్జెట్‌ను ప్రతిపాదించారు. వచ్చే ఆర్థిక సంవత్సరంలో మొదటి నాలుగు నెలల కోసం మాత్రమే తాత్కాలిక బడ్జెట్‌ను ప్రతిపాదిస్తున్నామని, జూలైలో పూర్తిస్థాయి బడ్జెట్‌ను ప్రవేశపెడతామని చెప్పారు. సంస్కరణలు కొనసాగిస్తామని, పేదలు, రైతులు, యువత, మహిళల సాధికారతే తమకు ప్రాధాన్య అంశాలని పేర్కొన్నారు. భారత ఆర్థిక వ్యవస్థ ఉజ్వలంగా పురోగమిస్తున్నదని, ద్రవ్యోల్బణాన్ని విజయవంతంగా అదుపు చేయగలిగామని చెప్పారు. గత పదేండ్లలో వివిధ రంగాలలో తమ ప్రభుత్వం సాధించిన విజయాలను ఏకరవు పెట్టిన ఆర్థిక మంత్రి.. తమ హయాంలో దేశం పరివర్తన చెంది ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థలలో ఒకటిగా నిలిచిందని పేర్కొన్నారు. మూడో పర్యాయం కూడా తమ ప్రభుత్వం అధికారంలోకి వస్తే 2047 నాటికి భారత్‌ను పూర్తిస్థాయి అభివృద్ధి దేశంగా మారుస్తామని అన్నారు. సుస్థిరమైన మౌలిక సదుపాయాల పెంపుద్వారా ఉద్యోగావకాశాలను సృష్టించడంపై దృష్టి పెడతామని చెప్పారు.

మౌలిక సదుపాయాలకు వ్యయం పెంపు

రోడ్లు, పోర్టులు, విమానాశ్రయాల వంటి మౌలిక సదుపాయాలకు వ్యయాన్ని11 శాతం పెంచి రూ.11.1 లక్షల కోట్లు కేటాయించినట్టు తెలిపారు. మౌలిక సదుపాయాలపై ఖర్చు పెట్టేందుకు రాష్ట్రాలకు రూ.1.3 లక్షల కోట్ల దీర్ఘకాలిక రుణాలను ఇవ్వనున్నట్టు చెప్పారు.ప్రత్యక్ష, పరోక్ష పన్ను విధానంలో మార్పు లేదని తెలిపారు. వ్యక్తిగత పన్ను చెల్లింపుదారులకు, కార్పొరేట్ సంస్థలకు ఆదాయ పన్ను విధానంలో మార్పు ఉండదని, దిగుమతి, ఎగుమతి సుంకాల్లో కూడా మార్పులేవీ చేయడం లేదన్నారు. 2014-15 సంవత్సరానికి ముందు వివాదాస్పద ట్యాక్స్ డిమాండ్లపై చెల్లింపుదారులకు ఊరట కల్పించారు.



స్థూల స్వరూపం

(రూ.కోట్లలో)

	2022-23 వాస్తవిక బడ్జెట్	2023-24 బడ్జెట్ అంచనాలు	2023-24 సవరించిన అంచనాలు	2024-25 బడ్జెట్ అంచనాలు
రెవెన్యూ రాబడులు	2383206	2632281	2699713	3001275
మూలధన రాబడులు	1809951	1870816	1790773	1764494
మొత్తం రాబడులు	4193157	4503097	4490486	4765768
రెవెన్యూ ఖాతా	3453132	3502136	3540239	3654657
మూలధన ఖాతా	740025	1000961	950246	1111111
మొత్తం వ్యయం	4193157	4503097	4490486	4765768
రెవెన్యూ లోటు	1069926	869855	840527	653383
ద్రవ్య లోటు	1737755	1786816	1734773	1685494
ప్రాథమిక లోటు	809238	706845	679346	495054

సబ్సిడీల కోత

ఆహార పదార్థాలు, ఎరువులు, ఇంధనంపై ఇస్తున్న సబ్సిడీలను ఎనిమిది శాతం తగ్గిస్తున్నట్టు నిర్మల సీతారామన్ ప్రకటించారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకానికి కేటాయింపులలో ఎటువంటి మార్పూ లేదని చెప్పారు. వచ్చే ఐదేండ్లలో మధ్య తరగతి వర్గాల కోసం ఓ పథకాన్ని ప్రారంభించి రెండు కోట్ల గృహాలను నిర్మించనున్నామని తెలిపారు. పర్యాటక కేంద్రాలను అభివృద్ధి చేసి వాటికి ప్రపంచస్థాయిలో ప్రచారం కల్పిస్తామని చెప్పారు. పంటల కోతల అనంతరం జరిగే వ్యవసాయ కార్యకలాపాలలో ప్రభుత్వ, ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహిస్తామని, నూనె గింజల ఉత్పత్తిలో స్వయం సమృద్ధిని సాధించేందుకు ప్రయత్నిస్తామని అన్నారు. రూఫ్‌టాప్ సోలార్ స్కీమ్ ద్వారా కోటి గృహాలకు ఒక్కోదానికి నెలకు 300 యూనిట్ల చొప్పున విద్యుత్తును ఉచితంగా అందిస్తామన్నారు. ఇన్నోవేషన్, టెక్నాలజీకి లక్ష కోట్ల కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తామని, ఇందులోంచి 50 ఏండ్లకు వడ్డీ రహిత, అతితక్కువ వడ్డీతో టెక్ ఔత్సాహికులకు రుణాలిస్తామని చెప్పారు. రక్షణ రంగంలో 'డీప్ టెక్' సాంకేతిక పరిజ్ఞానాన్ని బలోపేతం చేస్తామని అన్నారు.

ద్రవ్య లోటు 5.1 శాతం

ఖర్చుల్లో పెరుగుదల, మూలధన వ్యయానికి, సంక్షేమ పథకాలకు కేటాయింపులు పెరిగిన నేపథ్యంలో బడ్జెట్‌ను గత ఏడాది కన్నా 6.1 శాతం పెంచుతూ రూ.47.66 లక్షల కోట్లతో ప్రతిపాదిస్తున్నట్టు ఆర్థికమంత్రి తెలిపారు. గత ఏడాదితో పోలిస్తే వచ్చే ఆర్థిక సంవత్సరంలో ద్రవ్య లోటును జీడీపీలో 5.1 శాతానికి తగ్గించనున్నామని చెప్పారు. సవరించిన అంచనాల ప్రకారం ప్రస్తుత (2023-24) సంవత్సరంలో ద్రవ్య లోటు 5.8 శాతంగా నమోదైంది. వచ్చే ఆర్థిక సంవత్సరంలో రెవెన్యూ ఆదాయం రూ.30 లక్షల కోట్లు ఉంటుందని అంచనా పన్నులు-జీడీపీ నిష్పత్తి 11.7 శాతంగా ఉండవచ్చని పేర్కొన్నారు. గత పదేండ్లలో 596 లక్షల కోట్ల డాలర్ల విదేశీ పెట్టుబడులను ఆకర్షించామని చెప్పారు.

56 నిమిషాల ప్రసంగం

వరుసగా ఆరోసారి బడ్జెట్‌ను ప్రతిపాదించిన కేంద్ర మంత్రి నిర్మలా సీతారామన్ కేవలం 56 నిమిషాల్లో తన ప్రసంగాన్ని ముగించారు. 2020లో 2.40 గంటలు బడ్జెట్ ప్రసంగించిన నిర్మల ఆ తరువాత ఏటా తన ప్రసంగాన్ని కుదించుకుంటూ వస్తున్నారు. ఈ సారి సుమారు ఎనిమిదిసార్లు ఆమె మోదీ ప్రసంగాల నుంచి కొన్ని మాటలను ఉటంకించారు. ఎఫ్‌డీఐ, జీడీపీలకు నిర్మల కొత్త నిర్వచనం ఇచ్చారు. ఎఫ్‌డీఐ అంటే ఫస్ట్ డెవలప్ ఇండియా (ముందుగా భారత అభివృద్ధి) అని, జీడీపీ అంటే గవర్నెన్స్, డెవలప్‌మెంట్, పర్ఫార్మెన్స్ (పరిపాలన, పురోగతి, పనితీరు) అని పేర్కొన్నారు. గ్యాలరీలో కొద్దిమంది రాజ్యసభ సభ్యులు, నిర్మల కుటుంబ సభ్యులు తప్ప అంతా ఖాళీగా కనిపించాయి. ప్రధాని సభకు వచ్చినప్పుడు బీజేపీ సభ్యులు భారత్ మాతాకీ జై, జై సియారాం అంటూ నినాదాలు చేశారు. లోక్‌సభకు రాకముందు నిర్మల రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కలుసుకున్నారు.



యూజీసీకి 60% కోత

న్యూఢిల్లీ: స్వయంప్రతిపత్తి సంస్థ యూజీసీ సహా ఐఐటీ, ఐఐఎంలకు నిధులలో కేంద్రం గణనీయంగా కోత విధించింది. యూజీసీకి 60 శాతం కోత విధించారు. మేనేజ్‌మెంట్ విద్యను అందించే ఐఐఎంలకు సైతం వరుసగా రెండో ఏడాది కూడా నిధులను గణనీయంగా తగ్గించింది. యూజీసీకి ఈ సంవత్సరం రూ.2500 కోట్లు ఇవ్వాలని నిర్ణయించారు. అదే సమయంలో సెంట్రల్ యూనివర్సిటీల సపోర్ట్ గ్రాంట్‌ను 28 శాతానికి పైగా పెంచారు. ఐఐఎంల బడ్జెట్‌ను గత ఏడాది 608.23 కోట్ల నుంచి 331 కోట్లకు గణనీయంగా కోత వేశారు. పాఠశాల విద్య కేటాయింపులను 72,473.80 కోట్ల నుంచి 73,008 కోట్లకు పెంచగా, ఉన్నత విద్యకు 57244.48 కోట్ల నుంచి 47619.77 కోట్లకు తగ్గించారు.

కొత్త స్టార్టప్స్ కోసం లక్ష కోట్ల కార్పస్ ఫండ్

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కొత్త స్టార్టప్స్ ఏర్పాటు చేసేలా టెక్ ఆంత్రప్రెన్యూర్స్‌ను ప్రోత్సహించేందుకు కేంద్ర సర్కారు రూ.లక్ష కోట్ల కార్పస్ ఫండ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రకటించారు. టెకీ యువతకు 50 ఏండ్లపాటు వడ్డీలేకుండా రుణాలు ఇవ్వనున్నట్టు చెప్పారు. సుదీర్ఘకాలం ఫైనాన్సింగ్, రీఫైనాన్సింగ్‌లో భాగంగా ఈ స్కీమ్‌ను ఏర్పాటు చేస్తున్నట్టు వివరించారు. ప్రైవేట్ సెక్టార్లు సన్‌రైజ్ డొమైన్‌లో పరిశోధనలు, ఆవిష్కరణలు పెంచేందుకు ఈ కార్పస్ ఫండ్ తోడ్పడుతుందని చెప్పారు.

రాష్ట్రాలకు 50 ఏండ్ల పాటు 75 వేల కోట్ల వడ్డీ లేని రుణం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: సంస్కరణలను అమలు చేసేందుకు రాష్ట్రాలకు 50 ఏండ్ల పాటు వడ్డీ లేని రుణంగా రూ.75 వేల కోట్లు ఇవ్వనున్నట్టు సీతారామన్ బడ్జెట్ ప్రసంగంలో వెల్లడించారు. వికసిత్‌ను భారత్‌ను సాకారం చేసుకొనేందుకు రాష్ట్రాల్లో అభివృద్ధికి వీలు కల్పించే అనేక సంస్కరణలు అవసరమని పేర్కొన్నారు. ఈ మేరకు రాష్ట్రాలకు వడ్డీ లేకుండా రుణ మంజూరును ప్రతిపాదిస్తున్నట్టు తెలిపారు. 2047 నాటికి భారతదేశాన్ని అభివృద్ధి చెందిన దేశంగా, వికసిత్ భారత్‌గా మార్చాలని లక్ష్యంగా పెట్టుకొన్నామని, ఇందు కోసం ప్రజల సాధికారతను, సామర్థ్యాన్ని పెంచాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. ప్రజల అభివృద్ధికి తమ ప్రభుత్వం అన్ని స్థాయిలో కృషి చేస్తుందన్నారు.

మాల్దీవులకు ఆర్థిక సాయం కోత

న్యూఢిల్లీ: మాల్దీవుల వివా దం వేళ.. ఆ దేశానికి కేటాయిస్తున్న ఆర్థిక సాయంలో కేంద్రం కోత విధించింది. ఈసారి బడ్జెట్‌లో రూ.600 కోట్లు మాత్రమే కేటాయించింది. బంగ్లాదేశ్, ఆఫ్ఘానిస్థాన్, మయన్మార్, లాటిన్ అమెరికా దేలకు కూడా కేటాయింపులు తగ్గాయి.

లక్షద్వీప్‌ను అభివృద్ధి చేస్తాం

మరోవైపు లక్షద్వీప్‌ను పర్యాటకంగా మరింత అభివృద్ధి చేయనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మల వెల్లడించారు. నేటి అవసరాలకు అనుగుణంగా దేశంలో పర్యాటక రంగాన్ని మరింత బలోపేతం చేసేందుకు లక్షద్వీప్‌తో సహా అన్ని ద్వీప భూభాగాల్లో పోర్టు కనెక్టివిటీ, పర్యాటక మౌలిక సదుపాయాలు, ఇతర సౌకర్యాల ప్రాజెక్టులను చేపడుతామని ప్రకటించారు.

చక్కెరపై సబ్సిడీ మరో రెండేళ్లు పొడిగింపు

కేంద్రమంత్రివర్గం నిర్ణయం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: అంత్యోదయ అన్న యోజన (ఏఏవై) కింద దేశంలోని 1.89 కోట్ల కుటుంబాలకు రేషన్ షాపుల ద్వారా అందిస్తున్న సబ్సిడీ చక్కెర పథకాన్ని మరో రెండేళ్ల పాటు పొడిగించారు. ఈ పథకాన్ని 2026, మార్చి 31 వరకు పొడిగిస్తూ ప్రధాని నరేంద్ర మోదీ నేతృత్వంలో సమావేశమైన కేంద్ర మంత్రివర్గం నిర్ణయం తీసుకుంది. ఏఏవై లబ్ధిదారులకు ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి నెలా కేజీ చొప్పున ఈ సబ్సిడీ చక్కెరను అందిస్తున్నారు. ఈ చక్కెరపై కిలోకు రూ.18.50 వంతున కేంద్రం సబ్సిడీ ఇస్తున్నది. అయితే ఈ చక్కెర సేకరణ, పంపిణీ బాధ్యతలను మాత్రం ఆయా రాష్ట్రాలు చూస్తున్నాయి.

బడ్జెట్‌పై ఎవరేమన్నారంటే...

సమాఖ్యవాదానికి తూట్లు

రాష్ట్రాలకిచ్చే నిధుల గురించి బడ్జెట్‌లో ఒక్క మాట లేదు. వాళ్లు సమాఖ్యవాదానికి తూట్లు పొడిచి ఆర్థిక ఉగ్రవాదానికి పాల్పడుతున్నారు. క్షేత్ర స్థాయిలో దేన్నీ అమలు చేయని వీరికి ప్రజలు గుణపాఠం చెబుతారు.

- డెరెక్ ఓబ్రియెన్, టీఎంసీ ఎంపీ

నిజమైన వృద్ధి ఏదీ?

2015 నుంచి ప్రజల ఆదాయ స్థాయిలు 50% కుంచించుకుపోయాయి. అప్పులు ఎక్కువయ్యాయి. ఉద్యోగాలు తగ్గిపోయాయి. ఆహార ద్రవ్యోల్బణం అధికమైంది. వీటినెలా పరిష్కరిస్తారో బడ్జెట్‌లో ప్రస్తావించలేదు.

- శశిథరూర్, కాంగ్రెస్ ఎంపీ

నిరాశపరిచింది

బడ్జెట్ నిరాశపరిచింది. పన్ను రాయితీలు లేవు. ద్రవ్యోల్బణం, నిరుద్యోగం తారాస్థాయికి చేరాయి. మహిళల భద్రత, సాధికారత అమల్లో కనిపించడం లేదు.

- స్వాతి మలివాల్, ఆప్ ఎంపీ

ప్రజల ఆశలపై నీళ్లు

చెప్పడానికి, చేయడానికి చాలా తేడా ఉంది. పదేండ్లుగా చూస్తున్నది ఇదే. పేదలు, మహిళలు, యువతకు ఈ బడ్జెట్‌లో ఏమీ లేదు. సాధారణ ప్రజల ఆశలపై నీళ్లు చల్లారు.

- ప్రియాంక చతుర్వేది, శివసేన (యూబీటీ) ఎంపీ

దక్షిణాదికి ప్రత్యేక దేశం ఇవ్వండి

కర్ణాటక కాంగ్రెస్ ఎంపీ డిమాండ్

న్యూఢిల్లీ: కేంద్రం మధ్యంతర బడ్జెట్ ప్రకటించిన సందర్భంగా కర్ణాటక కాంగ్రెస్ ఎంపీ డీకే సురేశ్ వివాదాస్పద వ్యాఖ్యలు చేశారు. నిధుల కేటాయింపులో దక్షిణ రాష్ట్రాలపై కేంద్రం పూర్తి వివక్ష చూపిందని మండిపడిన ఆయన ఇలాంటి పరిస్థితుల్లో దక్షిణ భారత్‌కు ప్రత్యేక దేశం ఇవ్వాలని అన్నారు. 'దక్షిణ భారత దేశానికి బడ్జెట్‌లో అన్యాయం జరిగింది. దక్షిణాది రాష్ట్రాలకు రావాల్సిన నిధులు ఉత్తర ప్రాంతాలకు తరలిస్తున్నారు' అని ఆయన ఆరోపించారు. దక్షిణ ప్రాంతంపై హిందీ ప్రాంతవాసులు చూపుతున్న వివక్ష కారణంగా వేరే గతి లేక ప్రత్యేక దేశం కోసం డిమాండ్ చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

మధ్య తరగతి కోసం కొత్త హౌసింగ్ స్కీం

పీఎం ఆవాస్ యోజన కింద మరో 2 కోట్ల ఇండ్ల నిర్మాణం

న్యూఢిల్లీ: రాబోయే పార్లమెంట్ ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని మధ్య తరగతి ప్రజలను ఆకట్టుకునేందుకు కేంద్ర సర్కారు కొత్త హౌసింగ్ స్కీంను ప్రకటించింది. బస్తీలు, అద్దె ఇంట్లో ఉండేవారికి సొంతింటి కలను నిజం చేసేందుకు కొత్త స్కీంను తీసుకొస్తున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ వెల్లడించారు. అలాగే, పీఎం ఆవాస్ యోజన(గ్రామీణ్) కింద రాబోయే ఐదేండ్లలో మరో 2 కోట్ల ఇండ్లు నిర్మించాలని లక్ష్యంగా పెట్టుకున్నట్టు చెప్పారు. 2024-25 మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెట్టిన అనంతరం ఆమె మాట్లాడుతూ కరోనా సమయంలోనూ పీఎం ఆవాస్ యోజన(గ్రామీణ్) కొనసాగిందని, 3 కోట్ల ఇళ్ల నిర్మాణ లక్ష్యాన్ని త్వరలో చేరుకోనున్నామని తెలిపారు. పెరుగుతున్న జనాభాను దృష్టిలో పెట్టుకొని రాబోయే ఐదేండ్లు ఈ పథకాన్ని కొనసాగించాలని



ప్రభుత్వం నిర్ణయించినట్టు చెప్పారు. మొత్తం 2 కోట్ల ఇళ్లను నిర్మించనున్నట్టు తెలిపారు.

కోటి ఇండ్లకు సౌర విద్యుత్తు

- ఏటా 18 వేల కరెంటు బిల్లు ఆదా
- ఉచితంగా 300 యూనిట్ల కరెంటు
- 2030 నాటికి 50 శాతం పునర్వినియోగ ఇంధనం
- ఎలక్ట్రిక్ వాహనాలకు మరింత ఊతం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: దేశంలో పునర్వినియోగ ఇంధన ఉత్పత్తి, వినియోగాన్ని పెద్ద ఎత్తున ప్రోత్సహించనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలాసీతారామన్ తెలిపారు. కోటి ఇండ్లకు సోలార్ విద్యుత్తు అందుబాటులోకి తెచ్చేందుకు త్వరలోనే ప్రధాన్‌మంత్రి సూర్యోదయ యోజన పథకాన్ని ప్రారంభించనున్నట్టు చెప్పారు. ఈ పథకం ద్వారా ఒక్కో కుటుంబం నెలకు 300 యూనిట్ల విద్యుత్తును ఉచితంగా పొందుతుందని, ఏటా కరెంటుపై



రూ.18000 వరకు ఆదా చేసుకోవచ్చని వివరించారు. సంప్రదాయేతర ఇంధన వనరులు, వాటి ఉత్పత్తికి తీసుకోనున్న చర్యలను మధ్యంతర బడ్జెట్ ప్రసంగంలో తెలిపారు. 'రూఫ్‌టాప్ సోలార్ విద్యుత్తుతో ప్రతి కుటుంబం ఏటా రూ.15,000 నుంచి రూ.18,000 వరకు ఆదా చేసుకోవచ్చు. మిగులు కరెంటును విద్యుత్తు సంస్థలకు అమ్ముకోవచ్చు. ఈ పథకం ఎలక్ట్రిక్ వాహనాలకు చార్జింగ్ సౌకర్యం కూడా కల్పిస్తుంది. సోలార్ విద్యుత్తు ఏర్పాటు, సరఫరా తదితర రంగాల్లో అపారమైన పారిశ్రామిక, ఉద్యోగావకాశాలు కల్పిస్తుంది' అని వివరించారు.

2070 నాటికి జీరో ఎమిషన్ స్థాయికి

2070 నాటికి భారత్ నెట్ జీరో ఎమిషన్ (కర్బన ఉద్గారాలు) స్థాయికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకొన్నదని నిర్మలాసీతారామన్ తెలిపారు. 2030 దేశ మొత్తం ఇంధన వినియోగంలో 50 శాతం సంప్రదాయేతర (సోలార్, పవన, జల, జీవ) ఇంధనాల వినియోగం స్థాయికి చేరాలని నిర్ణయించినట్టు చెప్పారు. చార్జింగ్, మాన్యుఫ్యాక్చరింగ్ రంగాలను ప్రోత్సహించటం ద్వారా ఎలక్ట్రిక్ వాహనాల పరిశ్రమను విస్తరిస్తామన్నారు.



వివిధ శాఖలకు కేటాయింపులు ఇలా..

శాఖ	2024-25 మధ్యంతర బడ్జెట్	2023-24లో కేటాయింపు)
రక్షణశాఖ	రూ.6.21 లక్షల కోట్లు	రూ.5.94 లక్షల కోట్లు
కేంద్ర హోంశాఖ	రూ.2.02 లక్షల కోట్లు	రూ1.96 లక్షల కోట్లు
రైల్వే	రూ.2.55 లక్షల కోట్లు	రూ.2.4 లక్షల కోట్లు
జాతీయ రహదారులు	రూ.2.78 లక్షల కోట్లు	రూ.2.76 లక్షల కోట్లు
జల శక్తి మంత్రిత్వశాఖ	రూ.98,418 కోట్లు	రూ.96,549కోట్లు
తాగునీరు, పారిశుద్ధ్య శాఖ	రూ.77,390 కోట్లు	రూ.77,032కోట్లు
గిరిజన శాఖ	రూ.13,000 కోట్లు	రూ.7,605కోట్లు
ఢిల్లీ పోలీసు శాఖ	రూ.11,177 కోట్లు	రూ.11,940 కోట్లు
పర్యావరణ శాఖ	రూ.3,265 కోట్లు	రూ.3,231 కోట్లు
క్రీడాశాఖ	రూ.3,442 కోట్లు	రూ.3,396 కోట్లు
విదేశాంగ శాఖ	రూ.22,154 కోట్లు	రూ.18,050 కోట్లు
కేంద్ర మంత్రుల వేతనాలు, ఇతర ఖర్చులు	రూ.832కోట్లు	రూ.1289 కోట్లు
స్వచ్ఛభారత్ మిషన్ (గ్రామీణ)	రూ.7,192 కోట్లు	రూ.7,192 కోట్లు
నీటి వనరులు, గంంగా పునరుజ్జీవం	రూ.21,028 కోట్లు	రూ.19,516 కోట్లు
నేషనల్ హైవేస్ అథారిటీ ఆఫ్ ఇండియా	రూ.1.68 లక్షల కోట్లు	రూ.1.67లక్షల కోట్లు
సెంట్రల్ బ్యూరో ఆఫ్ ఇన్వెస్టిగేషన్ (సీబీఐ)	రూ.928 కోట్లు	రూ.928కోట్లు
లోక్‌పాల్	రూ.33.32కోట్లు	రూ.110.89కోట్లు
సెంట్రల్ విజిలెన్స్ కమిషన్ (సీవీసీ)	రూ.51.31కోట్లు	రూ.47.73కోట్లు

వ్యవసాయానికి 1.27 లక్షల కోట్లు

- నానో డీఏపీ విస్తరణ
- ఐదు ఇంటిగ్రేటెడ్ ఆక్వాపార్కుల ఏర్పాటు
- నూనె గింజల్లో స్వయం సమృద్ధి కోసం కొత్త పథకం



న్యూఢిల్లీ: కీలకమైన వ్యవసాయ శాఖకు మధ్యంతర బడ్జెట్‌లో రూ.1.27 లక్షల కోట్లు మాత్రమే కేటాయించారు. వ్యవసాయ రంగంలో పంట కోత అనంతరం జరిగే సేకరణ, నిల్వ, సమర్థ సరఫరా వ్యవస్థ, ప్రాసెసింగ్, మార్కెటింగ్, బ్రాండింగ్ వంటి కార్యకలాపాల్లో పబ్లిక్, ప్రైవేటు పెట్టుబడులను ప్రోత్సహించనున్నట్టు కేంద్ర ఆర్థిక మంత్రి సీతారామన్ తెలిపారు. నానో యూరియా విధానం విజయవంతమైన నేపథ్యంలో నానో డీఏపీని(ద్రవరూపం) అన్ని అగ్రో-క్లైమేటిక్ జోన్లకు విస్తరిస్తామన్నారు. పాడి రైతులను ఆదుకొనేందుకు, డెయిరీ రంగం అభివృద్ధికి సమగ్రమైన కార్యచరణ రూపొందిస్తామని, అదేవిధంగా సమీకృత ఆక్వాపార్కులు ఏర్పాటు చేస్తామని తెలిపారు. దేశీయ ఉత్పత్తిని పెంచడం ద్వారా వంట నూనె గింజల్లో స్వయం సమృద్ధి సాధించేందుకు 'ఆత్మనిర్భర్ ఆయిల్ సీడ్స్ అభియాన్' వ్యూహాన్ని రూపొందిస్తామని వెల్లడించారు.

పెంపు లేని రుణ మంజూరు లక్ష్యం

పీఎం కిసాన్ యోజన కింద 11.8 కోట్ల మంది రైతులకు ఆర్థిక సాయం అందుకొంటున్నారని సీతారామన్ తెలిపారు. పీఎం ఫసల్ బీమా యోజన కింద 4 కోట్ల మంది రైతులకు పంట బీమా కల్పించామన్నారు. కాగా, పీఎం కిసాన్ ఆర్థిక సాయాన్ని లోక్‌సభ ఎన్నికల ముందుట కేంద్ర ప్రభుత్వం రూ.6 వేల నుంచి రూ.9 వేలకు పెంచుతుందని అంచనా వేసినప్పటికీ, ఆ దిశగా సర్కార్ ఎలాంటి ప్రకటన చేయలేదు. అలాగే పంట రుణాల మంజూరు లక్ష్యాన్ని పెంచుతారని ఆశించినా, బడ్జెట్‌లో అలాంటి చర్యలేమీ లేవు.

రూ.14.13 లక్షల కోట్ల అప్పులకు సిద్ధం

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: ఆదాయ, వ్యయాల మధ్య ఉన్న వ్యత్యాసాన్ని పూడ్చుకునేందుకు ఏప్రిల్ 1 నుంచి మొదలయ్యే వచ్చే ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ నుంచి రూ.14.13 లక్షల కోట్ల రుణాలు సమీకరించాలని ఆర్థిక మంత్రి సీతారామన్ బడ్జెట్లో ప్రతిపాదించారు. అయితే ఈ మొత్తం 2023-24 ఆర్థిక సంవత్సరపు అంచనా రూ.15.43 లక్షల కోట్లకంటే తక్కువ. 2024-25 సంవత్సరంలో పన్ను ఆదాయం పెరుగుతుందన్న అంచనాలతో రుణ సమీకరణ లక్ష్యాన్ని కేంద్రం తగ్గించుకుంది. బాండ్లను జారీచేయడం ద్వారా ఈ మార్కెట్ రుణాల్ని ప్రభుత్వం సేకరిస్తుంది. ఆర్థిక మంత్రి లోక్‌సభలో మధ్యంతర బడ్జెట్‌ను సమర్పిస్తూ కేంద్ర ప్రభుత్వం సేకరించే రుణాలు తగ్గనున్నందున, ప్రైవేటు రంగానికి అధికస్థాయిలో రుణాలు అందుబాటులో ఉంటాయన్నారు.

రాయితీలకు భారీ కోత!

- ఫుడ్, ఫర్టిలైజర్స్ సబ్సిడీ తగ్గింపు
- గత ఏడాదితో పోలిస్తే 8% తగ్గుదల

న్యూఢిల్లీ, ఫిబ్రవరి 1: కేంద్రం తాజాగా ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌లో ఆహారం, ఎరువులు, పెట్రోలియం ఉత్పత్తులకు సంబంధించి పలు సబ్సిడీ కేటాయింపుల్లో భారీగా కోతలు విధించింది. గత ఏడాదితో పోలిస్తే ఆహారం, ఎరువుల సబ్సిడీని 8 శాతం మేర తగ్గించింది. 2024-25లో ఎరువుల సబ్సిడీని కేవలం రూ.1.64 లక్షల కోట్లకు పరిమితం చేసింది. 2023-24లో కేటాయించిన రూ.1.89 లక్షల కోట్లతో పోల్చితే.. ఈ సారి 13.2 శాతం తగ్గించారు. దీని వల్ల రైతులకు రావాల్సిన యూరియా సబ్సిడీపై, ఇతర ఎరువులపై, పోషకాల ఆధారిత సబ్సిడీపై (డీఏపీ, ఎంవోపీ) పెద్ద దెబ్బ పడనున్నది. అంతర్జాతీయంగా ఎరువుల ధరలు తగ్గుముఖం పడుతున్నా నిధుల్లో కేంద్రం కోతలు విధించింది. దేశం మొత్తం ఎరువుల వినియోగంలో యూరియా 55-60 శాతం వరకు ఉంటున్నది. రైతులకు సబ్సిడీ యూరియా 45 కిలోల బ్యాగ్ రూ.242లకు లభిస్తున్నది. దీనికి



పన్నులు, వేప పూత చార్జీలు అదనం. ఇదే బ్యాగ్ బహిరంగ మార్కెట్‌లో అసలు ధర సుమారుగా రూ.2200 అవుతుంది. ఇక ఆహారం, పెట్రోలియం ఉత్పత్తులపైనా సబ్సిడీకి సంబంధించిన కేటాయింపులకూ కేంద్రం కోత పెట్టింది. ఆహార ఉత్పత్తుల సబ్సిడీ కోసం ఈ బడ్జెట్‌లో రూ.2,05,250 కోట్లు కేటాయించింది. ఇది గత ఏడాదితో పోల్చితే 3.33 శాతం తక్కువ. అలాగే పెట్రోలియం ఉత్పత్తులపై సబ్సిడీ కోసం గత ఏడాది రూ.12,240 కోట్లు కేటాయించగా, ఈ సారి కేటాయింపుల్లో 2.6 శాతం కోత విధించింది. వంటగ్యాస్ సబ్సిడీని పూర్తిస్థాయిలో ఎత్తేసేందుకు కేంద్రం సిద్ధమవుతున్నట్టు కనిపిస్తున్నది.